VEGA
JEWELLERS
దివిలోనైనా.. భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 140

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 28 అక్టోబర్ 2026


## స్థానికాల్లోనూ అదే స్ఫూర్తి.. కూటమిని గెలిపించండి: ఎన్డీఏ నేతల విజ్ఞప్తి

● స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని ప్రజలను కోరిన చంద్రబాబు, పవన్
● టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిందని వెల్లడి ● సీట్లు దక్కని వారికి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామంటూ పవన్ కల్యాణ్ హామీ ● కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని నేతల వెల్లడి
● ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రం ముందుకు సాగుతోందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్




**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తిని ప్రదర్శించి, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు మీడియా సమావేశం నిర్వహించి, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు ప్రజల సంపూర్ణ మద్దతు అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉంటుందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు. రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అన్ని పార్టీలు సర్దుకుపోయాయని, క్షేత్రస్థాయిలోనూ కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సీట్లు దక్కని వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేసే బాధ్యతను కూటమి తీసుకుంటుందని పవన్ భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, పారిశ్రామికవేత్తల్లో ఉన్న నమ్మకం వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని పవన్ అన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 'పల్లె పండుగ 1.0, 2.0', 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.30 వేల కోట్లతో 3.20 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురైన ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించామని, గంజాయిపై ఉక్కుపాదం మోపామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో చూపిన ఆదరణనే స్థానిక ఎన్నికల్లోనూ చూపించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

## జగన్ బెదిరింపులకు ఎవరూ భయపడరన్న పవన్ కల్యాణ్

● రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగా ఉంటుందని వెల్లడి ● ప్రజల మధ్యకు వస్తే వారి మనోభావాలు అర్థమవుతాయని జగన్‌కు సూచన

**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో బదులిచ్చారు. వైసీపీ '2.0' అంటూ బెదిరింపులకు దిగితే, ఎన్డీఏ కూటమి '10శ' అంటే ఏంటో చూపిస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జగన్ బెదిరింపులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని పవన్ స్పష్టం చేశారు. బలహీనులు మాత్రమే బెదిరింపుల భాష మాట్లాడతారని, బలవంతులు ఎప్పుడూ అలా చేయరని అన్నారు. ఇలాంటి మాటల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణ-పాఠం చెప్పిన విషయాన్ని మరువరాదని అన్నారు. వైసీపీ 1.0 పాలనలో జరిగిన హింసను తాము ధైర్యంగా ఎదుర్కొన్నామని, ప్రజలకు అండగా ఎలా నిలవాలో తమకు బాగా తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లుగా, జగన్ ప్రజల్లోకి వస్తే వారి కష్టాలు, మనోభావాలు అర్థమవుతాయని పవన్ హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగానే ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వంటి సంక్లిష్టతలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రగతి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతామని తెలిపారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలి తప్ప హెచ్చరికలు జారీ చేయకూడదని సూచించారు. ఇదే సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీ నేతల ప్రవర్తన వల్ల సమాజం నష్టపోతోందని విమర్శించారు.



నియోజకవర్గంలో తీర ప్రాంత గ్రామాల్లో జోరు వర్షంలో సైతం హోం మంత్రి వి.అనిత పర్యటించారు.
-పాయకరావుపేట,కలంకౌంటర్:





## పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా.. భయపడొద్దు.. తిరగబడండి: జగన్

● ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్
● అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక
● పులివెందులలో కార్యకర్తలపై చేయి వేస్తే తనపై వేసినట్లేనని స్పష్టీకరణ



**పులివెందుల,కలంకౌంటర్ :** "ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు. "మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

## కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్.. అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

● అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష ● కాకినాడ సమీపంలో కేంద్రీకృతమైన తుపాను ● లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని కలెక్టర్లకు ఆదేశం ● సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాల వినియోగం ● విద్యుత్, రవాణా పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచన



**అమరావతి,కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధత, ముందస్తు చర్యలపై అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఈ తుపాను కాకినాడ సమీపంలోని యానాంకు 167 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గత ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ము-ఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

● పశ్చిమమధ్య బంగాళాఖాతంలో బలపడిన 'అర్ణబ్' తుపాను
● గంటకు 20 కి.మీ వేగంతో ఏపీ తీరం వైపు వేగంగా కదులుతున్న అతి తీవ్ర తుపాను ● రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
● తీరం దాటే సమయంలో గంటకు 125-135 కి.మీ. వేగంతో గాలులు
● కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక



**విజయవాడ, కలంకౌంటర్ :** పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 20 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను, ప్రస్తుతం విశాఖపట్నానికి 170 కి.మీ., కాకినాడకు 180 కి.మీ., మచిలీపట్నానికి 270 కి.మీ., బాపట్లకు 350 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. 'అర్ణబ్' ప్రభావంతో ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కోనసీమ జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు సాయంత్రం నుంచి పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుపాను రేపు (బుధవారం) ఉదయానికి బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, "తుపాను తీరం దాటే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి" అని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం సహాయక చర్యల కోసం సర్వసన్నద్ధంగా ఉంది.

## ఏపీ లిక్కర్ స్కామ్: రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట.. ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు కెసిరెడ్డి దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని స్పష్టమైన షరతులు విధించింది. ప్రొడక్షన్ వారెంట్ జారీని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అరెస్ట్ చేయబోమని కోర్టులో హామీ ఇచ్చాక కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులోని కొన్ని వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అయితే, కేవలం ఆ కారణంతో నిందితుడికి మంజూరు చేసిన బెయిల్‌ను, స్వేచ్ఛను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించింది.

# గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో కమల వికాసం...

● ప్రచార పర్వాన్ని పదునెక్కి స్తున్న కూటమి పార్టీల సమిష్టి కృషి.. ● ఓటు ద్వారా దేశాభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కోరుతున్న వైనం....



(ఎస్.వి.కృష్ణారావు, ఎన్నికల డెస్క్ కలం కౌంటర్)

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో కమలం చరిత్ర సృష్టించనుందా... రాష్ట్ర రాజకీయాలలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో అనేక చోట్ల బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారు. దీనికి మొదటి కారణం బిజెపి తనతో కలిసి నడిచే పార్టీలతో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పి అభివృద్ధిలో భాగస్వాములను చేయడం. పటిష్టమైన సైద్ధాంతిక భావజాలం, రాజకీయాలలో అవినీతి, కుహనా లౌకిక వాదానికి వ్యతిరేకంగా జాతీయ భావన, దేశ భక్తి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన కార్యకర్తలను తయారు చేయడం. అందువలననే బిజెపి పోటీ చేస్తున్న చోట్లకు కార్యకర్తలు స్వచ్ఛందంగా ఎవరి ఖర్చులు వారే పెట్టుకుని వచ్చి ప్రచారం జరుపుతుంటారు. ఇదే పరిస్థితి ప్రస్తుతం గిద్దలూరు పట్టణంలో కనిపిస్తుంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చి బిజెపి కార్యకర్తలు ప్రచారం చేస్తుంటే మన బాధ్యతగా ఓటు వేయాలేమా అనే ఆలోచన పెరిగింది. ప్రస్తుతం గిద్దలూరు పట్టణంలో ఏవీధిలో చూసినా బిజెపి జెండాలు పట్టుకుని ఓట్లు అభ్యర్థించే కార్యకర్తలే కనిపిస్తున్నారు.

**ఆచరణలో ఆదర్శం చూపిస్తున్న నాయక గణం:** గిద్దలూరు పట్టణంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై కూటమి పొత్తులో భాగంగా బిజెపి కి సీటు కేటాయించిన మరుసటి క్షణం నుండి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు శాసనాల సరోజినీ, మహిళా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎం. పుల్లయ్య, ఎన్నికల ఇన్చార్జి కొక్కెర శ్రీనివాస యాదవ్ మరియు అనేక మంది నాయకులు తిష్టవేసి స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు రాష్ట్ర పార్టీ నాయకులకు తెలియజేస్తూ కూటమి పార్టీల మధ్య సయోధ్య ను కుదిర్చారు. బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్సీ సోము వీర్రాజు గత ఐదు రోజులుగా గిద్దలూరులో తిష్టవేసి స్థానిక కార్యకర్తలలో ఉత్సాహం నింపుతూ పరిస్థితిని చక్కదిద్దారు. కూటమి పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుంటూ బిజెపి అభ్యర్థి విజయం కోసం సమిష్టి కృషి అవసరాన్ని తెలియచేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే బిజెపి అగ్ర నాయకత్వం ఎంత పటిష్టంగా ఉంటుందో చూపించారు. మంగళవారం రాత్రి బిజెపి ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల సంఘటనా మంత్రి మధుకర్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచారం, పోలింగ్ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు.

**పట్టు బిగించిన కూటమి నేతల ఎన్నికల ప్రచారం:** గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నేతృత్వంలో కూటమి పార్టీల నాయకులు టిడిపి,జనసేన, బిజెపి నాయకులు ఎన్నికల ప్రచారంలో పట్టు బిగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతున్నారు. దీంతో గిద్దలూరు మున్సిపాలిటీ ఎన్నికలలో కమల వికాసం సాకారం కానుంది.

## మార్కాపురం జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థి కోటపాటి సుధాకర్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ బీ-ఫారం



**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండల జడ్పీటీసీ సభ్యుడిగా, మార్కాపురం జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోటపాటి సుధాకర్ రెడ్డికి మార్కాపురం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్వగృహంలో మంగళవారం వైఎస్సార్ సీపీ బి.ఫాం అందజేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున కోటపాటి సుధాకర్ రెడ్డికి పార్టీ బీ-ఫారం మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## 'బి-ఫారాలు' అందజేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





**కావలి,కలంకౌంటర్ :** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేయనున్న టీడీపీ అభ్యర్థులకు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి బి-ఫారాలను అధికారికంగా అందజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమ్మేళనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు

# వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు

• మాజీ మంత్రి వెలంపల్లి, వైయస్సార్సీపిఅధికార ప్రతినిధి శ్యామల









**ఒంగోలు,కలంకౌంటర్ :** ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. మంగళవారం ఒంగోలులోని ధారావారి తోటలో జరిగిన ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు,వైఎస్ఆర్‌సీపీ స్టార్ క్యాంపెయినర్, అధికార ప్రతినిధి శ్యామల సందడి చేశారు.. ఈ సందర్భంగా శ్యామల స్వయంగా మురుగు కాలువలో చేయి పెట్టి, అందులోని ప్లాస్టిక్ బాటిళ్లను బయటకు తీశారు. తద్వారా మున్సిపాలిటీలో జరుగుతున్న పారిశుధ్య పనుల తీరును ఆమె ఎండగట్టారు. ఇది ఒక చెత్త ప్రభుత్వం కనుకనే ఎవరి ఇంటి ముందు ఉన్న చెత్తను వారే ఎత్తి పారేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థుల ఆటోలకు పర్మిషన్లు ఇవ్వడంలో జాప్యం చేయడం, నామినేషన్ల ప్రక్రియలో దౌర్జన్యాలకు పాల్పడటం అధికార పక్షానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతామనే భయంతోనే కూటమి ప్రభుత్వం ఇలాంటి అక్రమాలకు ఒడిగడుతోందని ఆరోపించారు. అధికారులు, పోలీసులు సైతం టీడీపీకి కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజా మద్దతు మాత్రం వైఎస్ఆర్‌సీపీకే ఉందని ఆమె స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలో అభివృద్ధి పూర్తిగా అధ్వాన్నంగా తయారైందని శ్యామల విమర్శించారు.

**నేను ఏ ఎమ్మెల్యేకీ తొత్తును కాను: కుప్పం ప్రసాద్..** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నగర మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ... తాను ఏ ఎమ్మెల్యేకీ తొత్తును కానని, నగరాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటానని అన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రంగంలోకి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి...

● 18వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి వేములపాటి చంటికి మద్దతుగా ప్రచారం..... ● గిద్దలూరు పట్టణం అభివృద్ధి టిడిపి హయాంలోనే......



కూటమి పార్టీలతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



కూటమి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



శ్రీనివాస థియేటర్ రోడ్డులో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఎన్నికల ప్రచారం....

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం కోసం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రంగంలోకి దిగారు. మంగళవారం పట్టణంలోని 18వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి వేములపాటి చంటికి మద్దతుగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, ఛైర్మన్ అభ్యర్థి డాక్టర్ జెవి నారాయణ ప్రచారం నిర్వహించారు. ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడినప్పుడు ప్రతి ఇంటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పట్టణంలో సిమెంట్ రోడ్డు, డ్రైన్లు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ కి ఓటు వేస్తే ఓటు మురిగి పోతుందన్నారు. నిరంకుశ, అభివృద్ధి నిరోధక పార్టీకి మరో మారు బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో టిడిపి,జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, సోము వీర్రాజు





**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు పట్టణంలోని ఎస్. ఎస్. ప్లాజాలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షులు, ప్రస్తుత ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూటమి ప్రభుత్వం బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి జె.వి. నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గిద్దలూరు పట్టణ అభివృద్ధికి సహకరించే దిశగా తమ అమూల్యమైన ఓటును కమలం గుర్తుపై వేసి జె.వి. నారాయణ గారిని కౌన్సిలర్ అభ్యర్థులు 24 మంది అభ్యర్థులకు సైకిల్ గుర్తు , 4 వార్డు లలో గాజు గ్లాసు గుర్తు పై ఓటువేసి, వేయించి గెలిపించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులను కోరారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొమరోలు మండలం జడ్పీటిసి సభ్యురాలుగా టిడిపికి చెందిన ముత్తుముల హరితమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక..



**గిద్దలూరు,కలంకౌంటర్ :** కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీలకు గాను 11 ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీ, ఒకటి సిపిఎం పార్టీ కైవసం చేసుకున్నాయి. అల్లినగరం ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి కానగారి రామస్వామి , రెడ్డి చర్ల ఎంపిటిసి టిడిపి అభ్యర్థి బిజ్జల తిరుమలరెడ్డి సురవారిపల్లి ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి వడ్డే వెంకటయ్య ఎడమ కళ్ళు ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి మూర్ల రాజేశ్వరి రాజుపాలెం ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి షేక్ మహబూబ్ బి దద్దవాడ ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి బిజ్జం వెంకటరామిరెడ్డి తాటిచర్ల ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి బోనేని రమణమ్మ నల్లగుంట్ల ఎంపీటీసీ టిడిపి అభ్యర్థి మందా మార్తమ్మ చింతలపల్లి టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి సారె సుభద్రాదేవి కొమరోలు 2 టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి వీరం రెడ్డి లక్ష్మిరాజా దేవి కొమరోలు 3 టిడిపి ఎంపీటీసీ సభ్యురాలు కూరాకు వెంకటసుబ్బమ్మ కొమరోలు ఎంపీటీసీ 1 కు సిపిఎం పార్టీకి చెందిన పోశాని నాగమణి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కాపురం జిల్లాలో తొలిసారిగా కొమరోలులో సిపిఎం పార్టీ బోణి కొట్టింది.

## రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న ఆర్.ఎం.పి డాక్టర్ రామాంజనేయులు



**కందుకూరు,కలంకౌంటర్ :** ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఒక పేషెంట్ కి అత్యవసరంగా అరుదైన గ్రూప్ అయిన బి నెగిటివ్ రక్తం అవసరమని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యుడు కందుకూరులో ఆర్ఎంపీ డాక్టర్ గా ప్రాక్టీస్ చేస్తున్న రామాంజనేయులు వెంటనే స్పందించి కందుకూరు నుండి ఒంగోలు వెళ్లి రక్తదానం చేశారు. ఆపద సమయంలో ఆదుకొని రక్తదానం చేసిన రామాంజనేయులు కి పేషంట్ తరపు బంధువులు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చెన్నా వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ ఆర్.ఎం.పీ డాక్టర్ రామాంజనేయులు ప్రతి మూడు నెలల కు ఒకసారి రక్తదానం చేస్తూ,ఏ సమయంలోనైనా ఎంత దూరమైనా వెళ్లి రక్తదానం చేస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని ప్రశంసించారు ఆరోగ్యవంతమైన వారు అందరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

## ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టిడిపిలోకి 8 కుటుంబాలు



**కందుకూరు,కలంకౌంటర్ :** లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన 8 కుటుంబాల వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారు... ముదిరెడ్డి మహేంద్ర రెడ్డి, ముదిరెడ్డి మాధవరెడ్డి,పిచ్చపాటి కృష్ణారెడ్డి, పల్లాల మాల్యాద్రిరెడ్డి,వెన్నపూస హజరత్ రెడ్డి, అద్దంకి ప్రసాద్,కేసనపల్లి పెద్దయ్య,నిమ్మకంటి యస్య తదితరులు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి. అలాగే గ్రామంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలిలి... అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి సూచించారు.కందుకూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.... మొగిలిచర్ల ఎంపిటిసి అభ్యర్థి గంగాడి పద్మ, స్థానిక నాయకులు పల్లపోతు వెంగళరావు, గంగాడి నరసింహం, మాల్యాద్రి, భాగ్యం, అంగులూరి చినకొండయ్య, ఓరుపల్లి అబ్రహం, సోమినేని మహేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## 18వ వార్డు టిడిపి కౌన్సిలర్ అభ్యర్థి వేములపాటి చంటికి ఎన్నికల ప్రచారంలో జన నీరాజనం....

- గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తా ...
- కూటమి పార్టీల మద్దతుతో గెలుపు పై ధీమా.......





ఎన్నికల ప్రచారంలో చంటికి ఓటర్ల ఆశీస్సులు

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో 18 వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేములపాటి చంటికి ఎన్నికల ప్రచారంలో ఓటర్లు నీరాజనం పడుతున్నారు. కూటమి పార్టీల మధ్య కుదిరిన సయోధ్య గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. తనను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తానని, రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తానని అంటున్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్నారు. వార్డులోని కూటమి పార్టీల నాయకులు,స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులను కలిసి మద్దతు సమీకరించారు. . గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి ఎమ్మెల్యే ఆశీస్సులతో వార్డు లో అభివృద్ధి చేస్తానని అంటున్నారు. వార్డులో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించే తమకు సైకిల్ గుర్తు పై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు..

## 10 వ వార్డులో గెలుపు తమదే అంటున్న టిడిపి..

- ఎన్నికల ప్రచారంలో లొక్కు రాజమ్మకు జన నీరాజనం...
- అన్నిసామాజిక వర్గాల మద్దతుతో రాజమ్మకే...
- అభివృద్ధి చేశాం, గెలిచి మరింత అభివృద్ధి చేస్తాం...



వ్యాపార వర్గాల మద్దతు లొక్కు రాజమ్మకే...



కూరగాయలు బండి వద్ద లొక్కు రమేష్ ప్రచారం...



**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికలలో 10 వ వార్డు నుండి పోటీ చేస్తున్న లొక్కు రాజమ్మదే విజయమని టిడిపి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కూటమి పార్టీలలో సయోధ్య కుదరడంతో గెలుపు ఏకపక్షం కానుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులోని పలు సామాజిక వర్గాల నాయకులు ఓటర్లను కలిసి మద్దతు సమీకరించారు. ఎన్నికల ప్రచారంలో ఓటర్లు, సామాజిక వర్గాల నేతలు ఆదరణ చూపిస్తున్నారని అన్నారు. గతంలో వార్డులో అభివృద్ధి చేశామని గెలిచి మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఎఇస్తున్నారు. నవంబర్ ఒకటో తేదీన జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. జరుగుతున్న ఎన్నికలలో మరో పర్యాయం వార్డులో విజయం పై ధీమా వ్యక్తం చేస్తున్నారు..

## నటుకుల కుటుంబాన్ని ఆదరించండి..

- వైశ్యులు , వ్యాపార సంస్థలకు అండగా ఉంటా
- నటుకుల శ్వేత లలితాదేవి కి మద్దతుగా స్నేహితుల ప్రచారం...
- గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తానంటున్న 11వ వార్డు టిడిపి అభ్యర్థి నటుకుల శ్వేతలతా...





**గిద్దలూరు,కలంకౌంటర్ :** మున్సిపల్ ఎన్నికలలో 11వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న నటుకుల శ్వేత లత తనను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తానని అంటున్నారు . గిద్దలూరు పట్టణంలో ఆర్యవైశ్య వర్గాల నుండి రాజకీయ అనుభవం ఉన్న నటుకుల కుటుంబం నుండి కూటమి పార్టీల (టిడిపి) కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్నికల రంగంలోకి దిగారు. వీరి కుటుంబం నుండి శ్వేత లత మామ కీ.శే. నటుకుల శేతురామయ్య గిద్దలూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గా, ఎంపిటిసి గా సేవలందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో 11వ వార్డులోని ఓటర్లను కలిసి మద్దతు కోరుతున్నారు. నటుకుల శ్వేత లత తన స్నేహితులతో కలిసి ప్రచారం నిర్వహించారు. 11వ వార్డులో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని, రోడ్లు , డ్రైన్లు, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తానని అంటున్నారు. ఆర్యవైశ్యులు, వ్యాపార సంస్థలకు అండగా ఉంటానని, వారికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నన్నారు. చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీ లేని రుణాలు ఇప్పించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని అంటున్నారు. నవంబర్ 1తేదీన జరుగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

## గిద్దలూరు 9వ వార్డులో జనసేన, టిడిపి మధ్య హోరాహోరీ....

- ఎన్డీఏ కూటమిలో రెబల్ అభ్యర్థిగా జనసేన నుంచి బేతంశెట్టి శ్యామల..
- టీడీపీ నుంచి ఎలిశెట్టి రవణమ్మ పోటీ....



**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో 9వ వార్డులో ధోనీసేన, టిడిపి లో మధ్య ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ముఖ్యంగా వార్డులో రాజకీయ పోటీ ఆసక్తికరంగా మారింది. ఎన్డీఏ కూటమి రెబల్ అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి బరిలోకి దిగిన బేతంశెట్టి శ్యామల గ్లాస్ గుర్తుపై ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన తెలుగుదేశం తరపున అలిశెట్టి రవణమ్మ సైకిల్ గుర్తుపై ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఒకే కూటమికి చెందిన పార్టీల అభ్యర్థులు ఒకే వార్డులో వేర్వేరు గుర్తులతో ప్రచారం నిర్వహిస్తుండటంతో 9వ వార్డు ఎన్నికలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఇరువురు అభ్యర్థులు ఇంటింటి ప్రచారంతో ఓటర్లను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ పోటీలో వార్డు ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

## కూటమి పార్టీల మద్దతుతో ముద్దర్ల లక్ష్మీదేవి విజయం ఖాయం...

- రోడ్లు, డ్రైన్లు , మౌలిక సదుపాయాలు మరో మారు కౌన్సిలర్ గా వార్డులో ముద్దర్ల మార్క్ అభివృద్ధి..
- ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సహకారంతో ఆదర్శ వార్డుగా మారుస్తాం...

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో 7వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముద్దర్ల లక్ష్మీదేవి విజయం పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీల మధ్య కుదిరిన సయోధ్యతో అన్ని వర్గాల నుంచి ఆదరణ పెరిగిందని అంటున్నారు. గతంలో వార్డులో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయించామన్నారు. వార్డు లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని లక్ష్మీదేవి తెలిపారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం నిర్వహణ , చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు, ఇంటి స్థలాలు మంజూరు వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. వార్డు ఓటర్ల దీవెనలతో మరో పర్యాయం మున్సిపల్ ఎన్నికలలో గెలిస్తే ఆదర్శ వార్డు గా అభివృద్ధి చేస్తానని అంటున్నారు. నవంబర్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు....



ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మీ దేవి భర్త ముద్దర్ల శ్రీను...



వ్యాపార సముదాయాల వద్ద ఎన్నికల ప్రచారంలో ముద్దర్ల శ్రీను.
















# వ్యాపారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా..

## -వైసీపీ మేయర్ అభ్యర్థి లంకా జ్యోతి

## మీ కుటుంబ సభ్యుడిని..... లంకా సూరిబాబు








**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగరంలో వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తామని, వ్యాపారులకు అండగా ఉంటామని వైసీపీ మేయర్ అభ్యర్థి లంకా జ్యోతి భరోసా ఇచ్చారు. బుధవారం స్థానిక గీతా మందిరం మొదటి ఫ్లోర్ లో కృష్ణా జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వైసీపీ విజ్ఞప్తి మేరకు వ్యాపారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ తనకు మున్సిపల్ పరిపాలన మీద, సమస్యలు మీద అవగాహన ఉందని, మీరు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే తప్పకుండా వ్యాపారులకు అండగా ఉంటామని తెలిపారు.

**మీ కుటుంబ సభ్యుడిని.. లంకా సూరిబాబు**

మీరు ఎప్పుడు పిలిచినా పలికే వ్యక్తిని. ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో సభ్యుడిని. వ్యాపారులందరితో నాకు సత్సంబంధాలు వున్నాయి. మీ కుటుంబ సభ్యుడిని. వైసీపీమేయర్, కార్పొరేటర్లు ను గెలిపిస్తే సమస్యలు పరిష్కారానికి ముందుంటా. ఫోర్ట్ రోడ్ విస్తరణ 60 అడుగులకు మాత్రమే విస్తరణ చేయాలన్నదీ మాజీ మంత్రి పేర్ని నాని గతం నుంచి నేడు కూడా చెబుతున్న విధానం అని స్పష్టం చేసారు. వ్యాపారులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణా జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సలార్ దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులు ఉడత్తు సాయి కిరణ్, ఎస్ ఎన్ గుప్తా, తటవర్తి కృష్ణ శిరీష,వ్యాపార ప్రముఖులు ఉదయగిరి మురళీ, టి ప్రసాద్,మాటూరి పూర్ణ, ఉడత్తు సురేష్, యర్రా శ్రీనివాస్, యండూరి సురేష్, మాటూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పోకిరిలపై బ్రహ్మాస్త్రం ఫోక్సో చట్టం.... తస్మత్ జాగ్రత్త....

## -మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలను ఏ రకంగా నైనా వేధించే వారిపై కఠినమైన షర్తు విధించే బ్రహ్మ అస్త్రం ఫోక్సో చట్టం అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకశెట్టి బాలాజీ అన్నారు. నేరం నిరూపణ అయితే ఈ చట్టం ద్వారా కఠిన జైలు శిక్షలు జరిమాన లు ఉన్నాయని, జిల్లా జడ్జి స్థాయి గల న్యాయమూర్తి కేసు విచారణ చేస్తున్నారని, ఈ కోర్టు కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ని కూడా నియమి ంచారని బాలాజీ తెలియజేశారు. వేమూరి వెంకటసుబ్బయ్య కుదరవల్లి సీతారామయ్య మరియు వేమూరి వెంకట రమేష్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళ వారం మచిలీపట్నం షార్కి గర్ల్స్ హాస్టల్లోని విద్యార్థినిలకు 40 వేల రూపాయలు ఖరీదు చేసే నూతన దు-స్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లంకిశెట్టి బాలాజీ మాట్లా డుతూ తల్లిదండ్రులు లేని మరియు నిరుపేదలు ఎక్కువగా ఉన్న గర్ల్స్ హాస్టల్లో వేమూరి చారిటబుల్ ట్రస్ట్ నూతన దుస్తులు అందించడం ద్వారా సేవా పరిధి పెంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గర్ల్స్ హైని హాస్టల్లో ఎస్టీ కులానికి చెందిన ఒక విద్యా ర్థిని అవినిగడ్డ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ తన జీతంలో నుంచి డబ్బు ఖర్చు పెట్టి చదివించడం అభినందనీయ మని బాలాజీ అన్నారు. ఆడ పిల్లలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని బాలాజీ అన్నారు. ఆడపిల్లలు సెల్ ఫోన్ లకు టీవీలకు, అపరిచితు లకు దూరంగా ఉండాలని సూచించారు. వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గాంధీ విద్యాలయంలో, మదర్స స్కూల్ లో, షార్కకీ గరల్స్ హాస్టల్లో 40 వేల రూపాయలతో నూతన అందజేస్తామని ట్రస్ట్ చైర్మన్ వేముల రమేష్ తెలియజేశారు తమ ట్రస్టు విద్యార్థులకు ముఖ్యంగా పేద విద్యార్థులకు చదువుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిరోజు దినపత్రిక చదవటం అలవాటు చేసుకోవాలని పుస్తక పట్నం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి రత్నగిరి, మాజీ కౌన్సిలర్ బొక్క నాంచారయ్య న్యాయవాది మాటూరి రాజేష్,నాగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ధర్మరాజు, హాస్టల్ వార్డెన్ మణి మార్టిన్, కరస్పాండెంట్ మార్టిన్ లూథర్, సింగ్ తదితరులు పాల్గొన్నారు. తమకు నూతన దుస్తులు అందజేసినందుకు వేమూరి చారిటబుల్ ట్రస్ట్ కు విద్యార్థినిలు ధన్యవాదాలు తెలియజేశారు




# ఒక్క అవకాశం ఇవ్వండి

## -వైసీపీ అభ్యర్థి సతీమణి రేణుకా రాణి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 47 వ డివిజన్ వైసీపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న ఎస్ ఎన్ గుప్తా కు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించి ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థి సతీమణి రేణుకా రాణి విజ్ఞప్తి చేసారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా ఇంటింటికి తిరిగి గత జగన్ ప్రభుత్వం లో సంక్షేమ పథకాలు, పేర్ని నాని చేసిన అభివృద్ధి గుర్తు చేసారు.

# 'బీసీ' విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండండి

## -బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం



**అమరావతి, కలంకౌంటర్ :** అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. తాజా ఆహారం, వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే అందజేయాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలతతో ఆమె ఫోన్ లో మంగళవారం మాట్లాడారు. తుఫాన్ వల్ల 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. తుఫాన్ ప్రభావం ఉన్న జిల్లాల్లో బీసీ సంక్షేమ, గురుకులాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో విధుల్లో ఉన్న అధికారులు సైతం ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో బలహీనంగా ఉన్న భవనాల నుంచి సురక్షిత భవనాల్లోకి విద్యార్థులను తరలించాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. బయట ఆహారం హాస్టళ్లలోకి, గురుకులాల్లోకి అనుమతించొద్దన్నారు. వర్షాల కారణంగా హాస్టళ్లు, గురుకులాల్లో పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తరగతి గదులు, విశ్రాంతి గదుల్లో పొడి వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు చిన్నపాటి అస్వస్థత కలిగినా తక్షణమే సమీప ఆసుపత్రులకు తరలాంలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశమివ్వొద్దని స్పష్టంచేశారు. అవసరమైన చోట సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.

# జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో 13 ఆసుపత్రులకు అనుమతులు మంజూరు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రుల నుంచి వచ్చిన దరఖాస్తులు, సంబంధిత తనిఖీ నివేదికలను కమిటీ సభ్యులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేశారు. కొత్తగా నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న రెండు ఆసుపత్రులకు, అనుమతుల పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఏడు ఆసుపత్రులకు, అలాగే అనుమతుల్లో మార్పులు (మోడిఫికేషన్) కోరుతూ దరఖాస్తు చేసుకున్న నాలుగు ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేశారు. మొత్తం 13 ఆసుపత్రులకు సంబంధించి దరఖాస్తులు, తనిఖీ నివేదికలను పరిశీలించిన అనంతరం కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. సమావేశంలో తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి టి. రాజా వెంకటాద్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.ఎల్. దయాకర్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ బి. చంద్రశేఖర్, ఎన్జీవో సభ్యుడు ఎం. ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో అర్నబ్ కంట్రోల్ రూమ్‌లు

● ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

● ప్రజలు అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తగా ఉండాలి ● జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం అర్నబ్ తుపాను ప్రభావంపై గౌరవ ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా విజయవాడ డివిజన్ (7569008425), తిరువూరు డివిజన్ (08673-251235), నందిగామ డివిజన్ (7893053534)లోనూ కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మండలస్థాయిలోనూ ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. తుపాను పరిస్థితులపై నిరంతరం నిఘా ఉంచుతూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ చర్యలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వర్షాలు, గాలుల ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని.. అయినా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.